epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 158 | ఆదివారం | 17.11.2024

# జర్నలిస్టుల పేరుతో...

## వసూళ్లు.. సెటిల్‌మెంట్లు

- జనగామలో పెట్రేగిపోతున్న కేటుగాళ్లు
- అధికారులను మచ్చిగ చేసుకుని అక్రమాలు
- వచ్చిన అమ్యామ్యాలతో టూర్లు, షీకార్లు
- గిఫ్టులుగా ఐ ఫోన్ల అందజేత..

జర్నలిస్టు అంటే ఒకప్పుడు సమాజానికి సేవ చేసే వాడు అని భావించే వారు. కానీ.. ఇప్పుడు పరిస్థితి మారింది.. జర్నలిస్టు అంటే జనాన్ని దోచుకోవడమే అనే కొత్త అర్థాన్ని లిఖిస్తున్నారు కొందరు ప్రబుద్ధులు.. జర్నలిస్టు పేరుతో వీరు చేసే ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. జర్నలిజంలో సరైన అక్షర జ్ఞానం లేకున్నా.. అన్నీ తామే అంటూ అధికారులను మచ్చిగ చేసుకుని అందిన కాడికి దోచుకోవడం.. దాచుకోవడమే వారి పని. జనగామ జిల్లాలో జర్నలిస్టుల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక కథనం.. రేపటి సంచికలో...




## దోష నివారణ పేరుతో మోసాలు

- హిజ్రాతో సహా నలుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్

## ఇక బీఆర్ఎస్ కనుమరుగే...

- 19న సీఎం సభను సక్సెస్ చేయాలి
- ఓరుగల్లులోనే విజయోత్సవ సభ
- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



General News



# జీడికల్ ఆలయ అభివృద్ధికి కృషి

- సౌకర్యాల ఏర్పాటుకు రూ.50 లక్షలు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** లింగాల గణపురం మండలంలోని జీడికల్లు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు చేపడుతున్న ఏర్పాట్లను స్టేషన్ ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి శనివారం సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈనెల 19 స్వామివారి ఎదుర్కోలు, 20వ తేదీన స్వామి వారి కళ్యాణ మహోత్సవం 21 వ తేదీన రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆ యా తేదీలలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల ను పురస్కరించుకొని గుట్టపై ఉన్న గుండం ను, కళ్యాణం కొరకు చేపట్టిన ఏర్పాట్లను, భక్తుల కోసం నిర్మించిన చలువ పందిళ్లను, పార్కింగ్ ప్రదేశాలను, లైటింగ్ ఏర్పాట్లను సంబంధిత అధికారులతో సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యుత్తు అభివృద్ధి పనులను సెంట్రల్ లైటింగ్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆర్డీవో గోపి రామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ... జీడికల్లు దేవస్థానం ఎంతో ప్రాశస్త్యం గలదని, గతంలో యాదగిరి గుట్ట కంటే జీడికల్లు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం కు భక్తులు అధికంగా వచ్చే వారన్నారు. జీడికల్లు దేవస్థానం ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాల లో ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. సత్రాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని, ఉచిత భోజన వసతికి కృషి చేస్తానన్నారు. ఆలయ పరిసరాలను తీర్చిదిద్దుతానని, అహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తానన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఏసీపీ భీమ్ శర్మ, ఇన్చార్జి తాసిల్దార్ ఆండాలు, డిపిఓ స్వరూప, ఎస్ ఈ ఎలక్ట్రిసిటీ వేణు మాధవ్, పంచాయతీరాజ్ డిఇ రవీందర్, దేవాలయ ఈవో వంశీ పాల్గొన్నారు.

# ఈషా గ్రామీణోత్సవం క్రీడోత్సవాలు షురూ

**జనగామ , మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం ధర్మకంచలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16వ గ్రామీణోత్సవం క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జనగామ ఏసీపీ పార్థసారధి , సీఐ దామోదర్ రెడ్డి ,జిల్లా యువజన మరియు క్రీడ అధికారి వెంకట రెడ్డి తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గోర్ సింగ్ , గంగిశెట్టి మనోజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ క్రీడోత్సవాలలో వాలీబాల్ క్రీడలు జనగామ జిల్లాలోని 12 మండలాల నుంచి మొత్తం 25 టీములు పాల్గొనడం జరిగింది. క్రీడాకారులు దాదాపు 200 వ్యాయమ విద్య ఉపాధ్యాయులు పదిమంది పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికి ఈషా ఫౌండేషన్ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈశా ఫౌండేషన్ సభ్యులు జలజ , జ్యోతి, రవి చందర్, శ్రీ ప్రియ, అనిల్,



రోహిత్, రూప, ప్రణవ్, మొహినోద్దీన్, రణధీర్, గాయత్రి, సంతోష్, మహేశ్వరి, అనంతలక్ష్మీ, భారతి సోనీ, శ్రీలత, సాయి రత్న, తదితరులు హాజరయ్యారు.





## అంతర్జాతీయ కరాటే పోటీల్లో

# ప్రతిభ చాటిన వినిశ్రిత

**వరంగల్ , మన చౌరాస్తా :** వరంగల్‌లోని శంభునిపేట రేనాల్డ్స్ హైస్కూల్ లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించింది. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ నామాల శ్రీధర్ మాట్లాడుతూ ఇటీవల గోవాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి జూనియర్ కరాటే పోటీల్లో పాఠశాల కు చెందిన ఐదవ తరగతి విద్యార్థిని తండా వినిశ్రిత బంగారు పతకం సాధించిందన్నారు. అండర్ 9 విభాగంలో ఇతర దేశం క్రీడాకారులతో తలబడి బంగారం పతకం సాధించడం హర్షణీయం అని అన్నారు. ఇంతటి ఘన విజయానికి ప్రోత్సాహం అందించిన యాజమాన్యానికి , విద్యార్థిని తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులోనే అత్యంత ప్రతిభను కనబరిచిన వినిశ్రిత భవిష్యత్తులో రాష్ట్రానికే కాదు దేశానికి ఎన్నో పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వినిశ్రిత గతంలో కూడా ఎన్నో జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి జాతీయ పోటీలలో పాల్గొని బహుమతులు సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీధర్ ,చైర్మన్ శ్రీ విద్యా ,ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి ,కోఆర్డినేటర్ అశ్విని, ప్రైమరీ ఇంచార్జ్ షకిల , కావ్య మరాఠీ,డీన్ కిరణ్ ప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.



# కేయూ వీసీని కలిసిన ఇస్తారి

**జనగామ, మన చౌరాస్తా :** కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్టర్ మల్లారెడ్డిని చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బిర్రు ఇస్తారి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జనగామ పీజీ కాలేజీ అభివృద్ధిపై వీసీకి వివరించారు. పీజీ కాలేజీలో పర్మినెంట్ పోస్టు మంజూరు చేయాలని, కాలేజీ పనులు త్వరగా పూర్తి చేసేందుకు మరిన్ని నిధులు అందజేయాలని కోరినట్టు ఇస్తారి తెలిపారు.

# కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి

**చేర్యాల, మన చౌరాస్తా :** కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఆకునురు గ్రామంలో చోటుచేసుకుంది. చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన పండుగ నర్సయ్య కు చెందిన ఎద్దు శనివారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తున్న క్రమంలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# ఇక బీఆర్ఎస్ కనుమరుగే..

- ఈ నెల 19న సీఎం సభ సక్సెస్ చేయాలి
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హనుమకొండ , మన చౌరాస్తా :** బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేకపోయిందని.. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోచుకుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పదేళ్లలో తెలంగాణలో అభివృద్ధి జరగలేదని.. కేవలం దోపిడీనే జరిగిందన్నారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలనను అందిస్తున్నామన్నారు. ఈ మేరకు హనుమకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. ''సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది. అధికారం కోల్పోయామనే అసహనంతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి భారాస ఉండదు. పదేళ్లలో బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాల కన్నా ఏడాది వ్యవధిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉద్యోగాలే ఎక్కువ. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది. మిగతా రాష్ట్రాల్లోనూ తెలంగాణ తరహా పథకాలు కావాలని అడుగుతున్నారు. కులగణనతో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ నిలుస్తోంది. సంక్షేమం, అభివృద్ధిలో భారాస నేతలతో చర్చకు సిద్ధం. అన్ని రకాలుగా ప్రజలను మెప్పించాం. అందుకే విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నాం. వరంగల్ విజయోత్సవ సభకు 'ఇందిరా మహిళా శక్తి సభ'గా నామకరణం చేశాం'' అని తెలిపారు.



### ఓరుగల్లులోనే తొలి విజయోత్సవ సభ

రాణి రుద్రమదేవి ఏలిన ఖిల్లా ఓరుగల్లు జిల్లాలో మొట్ట మొదటి విజయోత్సవ సభ నిర్వహించుకోవాలని ప్రభుత్వ నిర్ణయించిందని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. గడిచిన 11 నెలలుగా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అభివృద్ధిలో దూసుకుపోతున్నామని వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో మన పనీతరు ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్షం సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నప్పు టికి నిజమైన లబ్దిదారులు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వారు ఎన్ని అప్రజాస్వామిక పనులు చేసినా కాంగ్రెస్ మాత్రం ప్రజాస్వామిక పద్ధతిలోనే ముందుకు వెళుతుండన్నారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పై వరాల జల్లు కురిపించనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. నగరంలోనూ అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న జరిగే మహిళ సదస్సును విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. జరిగిన అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి వివరిస్తార ని తెలిపారు. దేశంలోనే కులగమున చేపట్టి దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్ గా నిలిచిందని అన్నారు. బీజేపీ దేశంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ కం పెనీలకే మేలు జరిగే విధంగా చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వవిప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగారాజు, గండ్ర సత్యనారాయణ రావు, డాక్టర్ మురళి నాయక్, మేయర్ గుండు సుధారాణి, జిల్లా పార్టీ అధ్యక్షులు ఎర్ర బెల్లి స్వర్ణ, పైదాకుల అశోక్, ప్రకాష్ రెడ్డి, ,ప్రతాప్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మార్నెని రవీందర్ రావు, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ నాయకులు, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# దోష నివారణ పేరుతో మోసాలు

- హిజ్రాతో సహా నలుగురి అరెస్ట్
- 30 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజమహేంద్ర నాయక్

**జనగామ, మన చౌరాస్తా :** దోషాలు తొలగిస్తానని అపాయకులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్న హిజ్రా సహా నలుగురిని జనగామ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు సంబంధించిన వివరాలను వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ వెల్లడించారు. శనివారం జనగామ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన బట్టు నాగదేవి అనే ట్రాన్స్ జెండర్ జనగామ జిల్లా బాణాపురానికి చెందిన పాముకుంట్ల సందీప్ అనే యువకుడిని వివాహం చేసుకుంది. వీరు మూడేళ్లుగా జనగామలోని వ్యవసాయ మార్కెట్ ఏరియాలో నివాసముంటున్నారు. వీరు భిక్షాటన ద్వారా వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో దోష నివారణ పూజల పేరుతో ప్రజలను మోసగించడం మొదలు పెట్టారు. కొన్ని రోజుల కింద పట్టణంలోని వెంకన్న కుంటకు చెందిన సిరివెన్నెల వద్ద పలు పూజల పేరుతో విడతల వారీగా రూ.55 లక్షలు వసూలు చేశారు. ఆ తర్వాత మోసపోయామని గుర్తించిన బాధితులు జనగామ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 13న ఫిర్యాదు చేశారు. కాగా, శనివారం నెహ్రూ పార్క్ వద్ద సీఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా ఓ కారులో నలుగురు యువకులతో కలిసి వస్తున్న నాగదేవి అదుపులోకి తీసుకున్నట్టు డీసీపీ తెలిపారు. నాగదేవితో పాటు పాముకుంట్ల సందీప్, మెతుకు గణేశ్, గుతులోతు నవీన్, భూక్యా గణేశ్ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఎర్టీగా కారు, 30 తులాల బంగారం, 20 తులాల వెండి, 4.6 గ్రాముల బంగారానికి సంబంధించిన ముతూట్ డిపాజిట్ స్లిప్, రెండు ల్యాండ్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. విలేకరుల సమావేశంలో ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, కేసు చేధనలో చాకచక్యంగా పనిచేసిన ఏసీపీ, సీఐలతో పాటు సిబ్బందిని డీసీపీ అభినందించారు.

# సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్మిస్తాం..

- సీపీపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రజా సమస్యల పరిష్కారం, పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం రానున్న రోజుల్లో ఉద్యమాలు నిర్మిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని ఈడెన్ గార్డెన్ లో జరిగిన పార్టీ 8వ మండల మహాసభలకు గొర్రె శ్రీనివాస్, రేపాక కుమార్, గోగురు చంద్రకళ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలు అనేక హామీలు ఇచ్చాయని వాటిని అమలు చేయడంలో పాలకులు వైఫల్యం చెందుతున్నారని ఇచ్చిన మాటను తుంగలో తొక్కి ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, కొనుగోలు మాత్రం నత్త నడకన నడుస్తున్నాయన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజల మధ్య కులాల మతాల పేరుతో విభజనలు తీసుకువస్తూ ప్రజల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. మహాసభల్లో సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో, బండ కింది అరుణ్ గౌడ్, బద్దిపడగ కృష్ణారెడ్డి, రామ్ సాగర్ తాజా మాజీ సర్పంచ్ కొమరవెల్లి మండల కార్యదర్శి తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, అత్తిని శారద, మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, మోకు దేవేందర్ రెడ్డి, మల్కని ఎల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.





# సీఎం పర్యటనకు ఏర్పాట్లను పక్కాగా ఉండాలి

## కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా తగిన ఏర్పాట్లపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు శనివారం హనుమకొండ జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 19న ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజ్ లో జరిగే కార్యక్రమంలో జనగామ జిల్లా నుంచి 3500 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో రెండు స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే పెంబర్తి హస్తకళలకు సంబంధించి ఇత్తడితో రూపొందించిన హస్తకళలు, జౌళి శాఖ నుంచి ఒక్కోటి చొప్పున రెండు స్టాళ్లను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.125 కోట్ల చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో సంబంధిత ఉమ్మడి జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబ సమాచారాన్ని సేకరించాలి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** సమగ్ర ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబ సమాచారాన్ని సేకరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. జిల్లాలోని చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ పరిధిలో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు సర్వే చేసే విధానం, ఫార్మ్ లలో నమోదు చేసే ప్రక్రియను పరిశీలించి, గ్రామ పరిధిలో 1,097 గృహాలున్నాయని, వీటిని తొమ్మిది ఎన్యూమరేషన్ బ్లాకులుగా విభజించి సర్వే చేసేందుకు తొమ్మిది మంది ఎన్యూమరేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 673 కుటుంబాల సమగ్ర సమాచారాన్ని సేకరించామని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా ప్రతి కుటుంబం సమగ్ర సమాచారాన్ని సేకరించి, నమోదు చేయాలని, సేకరించిన సమాచార ఫార్మ్ లను గోప్యంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సరస్వతి, ఎంపీఓ మధుసూదన్, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.







'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812




## ఓటరు సవరణను పరిశీలించిన జిల్లా రోల్ ఆబ్జర్వర్

**జనగామ, మన చౌరాస్తా :** 2025 సంవత్సరానికి సంబంధించిన ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని జనగామ జిల్లా రోల్ ఆబ్జర్వర్ ఐషా మస్రత్ ఖానమ్, ఐఏఎస్ శనివారం పరిశీంచారు. జిల్లాలోని పలు పోలింగ్ స్టేషన్లను ఆమె సందర్శించి చెక్ చేశారు. జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లు అయిన పెంబర్తి 275, 276 బూత్‌లు, అలాగే జనగామ టౌన్‌లోని స్టేషన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ హైస్కూల్‌లో 245, 246, 257 ను ఆమె పరిశీలించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ని ఘన్ పూర్ స్టేషన్లో ని 118, 119 బూత్‌ను చెక్ చేశారు. ఆమె వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు గోపిరామ్, వెంకన్న, తహసీల్దార్లు హుస్సేన్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

## జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా మారుజోడు రాంబాబు



**జనగామ, మన చౌరాస్తా :** రఘునాథపల్లి మండలం మాజీ జడ్పీటీసీ మారుజోడు రాంబాబు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయాల్లో క్రియాశీల నేతగా, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి నమ్మిన బంటుగా రాంబాబు ఇంతకాలం నుంచి పనిచేస్తున్నారు. శ్రీహరి టీడీపీ, టీఆర్ఎస్, కాంగ్రెస్ ఇలా ఏ పార్టీలో ఉన్నాయనకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ వస్తున్నారు. రాంబాబు నియామకం పట్ల పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## బీఆర్ఎస్ ఓ సెక్యులర్ పార్టీ

**హనుమకొండ , మన చౌరాస్తా :** బీఆర్ఎస్ మాత్రమే సెక్యులర్ పార్టీ అని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కలిసి శనివారం రోజున విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ బీజేపీ ఒకటేనని ఆరోపించారు . కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీ రుణాలు మాయమయ్యాయి అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన మైనార్టీ రుణాలను సైతం కాంగ్రెస్ నిలిపివేసిందని ఆరోపించారు. మహిళలకు కుట్టు మిషన్లు అందజేసే కార్యక్రమాన్ని సైతం ఎగవేసిందని అన్నారు. మైనార్టీల సంక్షేమాన్ని అమలు చేయడం, హక్కులను కాపాడడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. రానున్న రోజుల్లో మైనారిటీలు పోరుబాట పడతారని అన్నారు. కార్యక్రమం లో నయీముద్దీన్, సయ్యద్ మసూద్, ఇస్మాయిల్, ఖలీల్, తస్లీమ్, గౌస్ ఖాన్, అహ్మద్, అబిద్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.




# ఆకట్టుకున్న మహావతార్




**మన చౌరాస్తా, సినిమా :** ఇటీవల మైథలాజికల్ సినిమాలు చాలానే వస్తున్నాయి. మన పురాణాల్లోనివి పాత్రలు, కథలు తీసుకుని వాటిని ఇప్పటి కాలానికి లింక్ ఇస్తూ సరికొత్త కథలు తెస్తున్నారు. తాజాగా నరసింహుడిపై సినిమా రానుంది. హోంబలె నిర్మాణ సంస్థలో అశ్విన్ కుమార్ దర్శకత్వంలో 'మహావతార్ నరసింహ' అనే సినిమా రాబోతుంది. ఇందుకు సంబంధించిన 'మహావతార్ నరసింహ' మోషన్ పోస్టర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ఇందులో భయంకరమైన నరాంసింహ స్వామి అవతారాన్ని చూపించారు. మరి ఇది నరసింహ అవతారం కథలా చూపిస్తారా.. ప్రస్తుత కథకు లింక్ చేస్తూ చూపిస్తారా చూడాలి. ఇక ఈ సినిమాని పాన్ ఇండియా లెవల్లో నిర్మిస్తున్నారు. 3Dలో కూడా ఈ సినిమా రానుంది. ఇప్పటికే షూటింగ్ జరుగుతున్నట్టు సమాచారం. త్వరలోనే ఈ సినిమా థియేటర్స్ లోకి వస్తుందని ప్రకటించారు. శనివారం విడుదల చేసిన మోషన్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది.